క్లుప్తంగా

దశలవారీగా సమస్యల పరిష్కారం



మాట్లాడుతున్న తోటాడ సర్పంచ్ మంగవేణి

మునగపాక : తోటాడ పంచాయతీలో సమస్యలను దశలవారీగా పరిష్కరిస్తామని సర్పంచ్ దొడ్డి మంగవేణి పేర్కొన్నారు. మండలంలోని తోటాడ పంచాయతీ కార్యాలయం వద్ద శుక్రవారం గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా మంగవేణి మాట్లాడుతూ పారిశుద్ధ్యం, తాగునీరు, వీధిదీపాల నిర్వహణతో పాటు రహదారులు, డ్రెయిన్ల నిర్మాణాలకు పాలకవర్గం కృషి చేస్తుందన్నారు. కార్యక్రమంలో ఎంపీటీసీ కాండ్రేగుల వెంకటలక్ష్మి, పంచాయతీ కార్యదర్శి శ్రీలక్ష్మి, వైఎస్సార్‌సీపీ నేత దొడ్డి బాలాజీ, వార్డు సభ్యుడు బుద్ద రమేష్‌నాయుడు పాల్గొన్నారు.

నేడు కొత్త పింఛన్‌ల పంపిణీ

మునగపాక : గంటవానిపాలెంలో శనివారం ఎమ్మెల్యే యు.వి. రమణమూర్తిరాజు (కన్నబాబు) పర్యటిస్తారని ఎంపీడీవో రవికుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 గంటలకు మండల వ్యాప్తంగా నూతనంగా మంజూరైన పింఛన్‌లను లబ్ధిదారులకు అందజేసే కార్యక్రమంలో ఆయన పాల్గొంటారన్నారు. అధికారులు, ప్రజా ప్రతినిధులు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని రవికుమార్ కోరుతున్నారు.

రైతులకు అందుబాటులో ఎరువులు, విత్తనాలు



మాట్లాడుతున్న వాడ్రాపల్లి వీఏఏ తులసి

మునగపాక : రైతులు ఈ-పంట నమోదుపై దృష్టి సారించాలని వాడ్రాపల్లి వీఏఏ తులసి కోరారు. మండలంలోని వాడ్రాపల్లి ఆర్‌బీకేలో శుక్రవారం వ్యవసాయ సలహా మండలి గ్రామ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సీజన్‌లో రైతులకు అవసరమయ్యే ఎరువులు, విత్తనాలు అందుబాటులో ఉంచామన్నారు. రబీకి సంబంధించి ఈ-పంట నమోదు జరుగుతుందన్నారు. అలాగే పీఎం కిసాన్ సేవలు పొందాలంటే రైతులు తప్పనిసరిగా ఈకేవైసీ చేయించుకోవాలన్నారు. వాడ్రాపల్లి సర్పంచ్ నూకరాజు మాట్లాడుతూ ఆర్‌బీకే సేవలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. సమావేశంలో సలహామండలి సభ్యులు పాల్గొన్నారు.

ఒలింపియాడ్ పరీక్షలలో 230 మంది ఎంపిక



టాలెంట్ టెస్ట్‌కు ఎంపికైన విద్యార్థులు

పాయకరావుపేట : స్థానిక శ్రీ చైతన్య పాఠశాల విద్యార్థులు ఇంటర్నేషనల్ టాలెంట్ సెర్చ్ ఒలింపియాడ్ పరీక్షలో 230 మంది ఉత్తీర్ణత సాధించి రెండో దశకు ఎంపికయ్యారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రిన్సిపాల్ మాణిక్యాలరావు మాట్లాడుతూ విద్యాపరంగా నిర్వహించే పోటీ పరీక్షలు అన్నింటిలో శ్రీ చైతన్య విద్యా సంస్థల విద్యార్థులు ఉంటారని తెలిపారు. ప్రతిభ సాధించిన విద్యార్థినీ విద్యార్థులను విద్యాసంస్థల ఎగ్జిక్యూటివ్ ఏజీఎం సురేష్, కాకినాడ రీజినల్ ఇంచార్జ్ గోపీనాథ్ అభినందించారు.స్కూల్ డీన్ సురేష్, అసిస్టెంట్ డీన్ శివ పాల్గొన్నారు.

గ్రామాల్లో ఫ్రై డే డ్రై డే కార్యక్రమాలు



నిల్వనీటిని పారబోయిస్తున్న వైద్య సిబ్బంది

పాయకరావుపేట : మండలంలో గల శ్రీరాంపురం పీహెచ్‌సీ పరిధిలో 10 గ్రామాల్లో ఫ్రై డే డ్రై డే కార్యక్రమాలు నిర్వహించినట్టు పీహెచ్‌సీ వైద్యాధికారిణి పి.కావ్య తెలిపారు. గ్రామాల్లో వైద్య సిబ్బంది యాంటీలార్వా ఆపరేషన్‌తో పాటు కాటకజనత వ్యాధులపై అవగాహన కల్పించారు. డెంగీ, చికెన్ గున్యా, మలేరియా, ఫైలేరియా, మెదడువాపు జ్వరాలు రాకుండా దోమలు నివారణకు తీసుకోవలసిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. ఇంటి వద్ద నిల్వ నీరు లేకుండా ఎప్పటికప్పుడు పారబోయించాలని సూచించారు. కార్యక్రమంలో కాంటాక్ట్ హెల్త్ అసిస్టెంట్ ప్రసాద్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

జగనన్న పథకాలతో ప్రతి ఇంటా వెలుగు



గోకులపాడు గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్యే గొల్ల బాబూరావు

ఎస్.రాయవరం : జగనన్న పథకాలతో నిరుపేద, మధ్య తరగతి కుటుంబాలు ఆనందం వ్యక్తం చేస్తున్నారని పాయకరావుపేట ఎమ్మెల్యే గొల్ల బాబూరావు అన్నారు. గోకులపాడు గ్రామంలో రెండో రోజు గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. ఏ గడపకు వెళ్లినా మాకు జగనన్న నవరత్నాల్లో కొన్ని పథకాలు అందాయని ప్రతి కుటుంబం నుంచి సమాధానం రావడంతో ఎమ్మెల్యే ఆనందం వ్యక్తం చేశారు. అమ్మా, అక్కా, చెల్లి, తమ్ముడూ...ఇంకా మీకేం కావాలి... మన ప్రభుత్వంలో చేసి పెడతాం అంటూ అందరినీ ఆప్యాయంగా పలకరించారు. గ్రామంలో తాగునీటికి రూ.68 లక్షలు విడుదల చేశామని త్వరలో ఆ పథకం ద్వారా ఇంటింటికీ కుళాయి ఏర్పాటు చేసుకోవచ్చన్నారు. సమస్యాత్మకంగా కొన్ని వీధి రోడ్లకు తాత్కాలికంగా మరమ్మతులు చేపట్టాలని ఎన్ఆర్ఈజీఎస్ ఏపీవో సత్యవతిని ఆదేశించారు. శాశ్వత రోడ్డుకు నివేదిక సిద్ధం చేయాలని మండల ఇంజినీరింగ్ అధికారులకు సూచించారు. డ్రైనేజీలు ఎప్పటికప్పుడు శుభ్రం చేయించాలని పంచాయతీ కార్యదర్శి రామిరెడ్డికి చెప్పారు. కొత్త డ్రైనేజీలు నిర్మించాలని, ఇళ్లపై సర్వీస్ లైన్లలో ప్రమాదకరంగా ఉన్న విద్యుత్ వైర్లను తొలగించాలని బాధితులు ఎమ్మెల్యేలకు విన్నవించారు. 10 రోజుల వ్యవధిలో స్తంభాలు మార్పు చేయాలని విద్యుత్‌శాఖ అధికారులను ఆదేశించారు. ఇలా ప్రతి గడపను ఎమ్మెల్యే సందర్శించి ఉత్సాహభరితంగా కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ అద్దేపల్లి బాబూరావు, మాజీ సర్పంచ్ అద్దేపల్లి నూకునాయుడు, పెనుగొల్లు, ఎస్.రాయవరం పీఏసీఎస్ చైర్‌పర్సన్లు దోసపాత్రుని హనుమంతరావు, అల్లాడ నాగరాజు, వైఎస్సార్‌సీపీ నాయకులు పోలిశెట్టి పెద ఈశ్వరరావు, మైలారు శ్రీనివాసరావు, చల్లపల్లి సత్యనారాయణ, తూము బుచ్చిబాబు, మందగుదుల వెంకటరమణ, బొండా శ్రీనివాస్, సర్పంచ్‌లు మల్లే లోవరాజు, దారబోయిన గణేష్, ఎంపీడీవో రామచంద్రమూర్తి, మండల ఇంజినీర్ దుర్గాశంకర్, ఆర్‌డబ్ల్యూఎస్ జేఈ శ్రీనివాస్ పాల్గొన్నారు.

ప్రత్యేకావసరాల విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ



శిక్షణ కేంద్రంలో ఉన్న దివ్యాంగులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే గొల్ల బాబూరావు

ఎస్.రాయవరం : ప్రత్యేకావసరాలు కలిగిన విద్యార్థులకు మెరుగైన వైద్య సేవలు, అవసరమైన పరికరాలు అందివ్వాలని పాయకరావుపేట ఎమ్మెల్యే గొల్ల బాబూరావు అన్నారు. గోకులపాడు పర్యటనకు వచ్చిన ఎమ్మెల్యే పాఠశాలలో ఏర్పాటు చేసి దివ్యాంగుల శిక్షణ కేంద్రాన్ని సందర్శించారు. ఈ పాఠశాలలో దివ్యాంగులకు అందుతున్న సేవలపై ఆరా తీశారు. ప్రత్యేక అవసరాల కోసం ఏర్పాటు చేసిన పాఠశాలలో మరింత మందికి సేవలు అందేలా చూడాలన్నారు. ఇక్కడ వివిధ విభాగాల్లో శిక్షణ వ్యాయామం పొందిన దివ్యాంగులకు అవసరమైన వైద్య సేవలు, కావల్సిన పరికరాలు అందివ్వాలన్నారు. వీరికి పరికరాలు అవసరమయితే ప్రభుత్వం నుంచి వచ్చేలా సహకారం అందిస్తానన్నారు. ఎమ్మెల్యే వెంట వైఎస్సార్‌సీపీ నాయకులు అద్దేపల్లి నూకునాయుడు, పోలిశెట్టి పెదఈశ్వరరావు, వీర్రాజు, ఉపసర్పంచ్ అద్దేపల్లి బాబూరావు పాల్గొన్నారు.

ఉచిత బస్సుల్లో శ్రీవారి దర్శనానికి పయనం



కొబ్బరికాయ కొట్టి ఉచిత బస్సులను ప్రారంభిస్తున్న దృశ్యం

అచ్యుతాపురం(అనకాపల్లి) : సమరసతా సేవా ఫౌండేషన్ సబ్ డివిజన్ పరిధిలోని అచ్యుతాపురం, మునగపాక, రాంబిల్లి మండలాల నుంచి శ్రీవారి దర్శనానికి ఉచిత బస్సుల్లో భక్తులు శుక్రవారం బయలుదేరారు. తిరుమల తిరుపతి దేవస్థానం ఆధ్వర్యంలో కల్పించిన ఈ సౌకర్యంలో భాగంగా మత్స్యకార ప్రాంతాల నుంచి భక్తులు తరలివెళ్లారు. రాష్ట్ర వ్యాప్తంగా 289 దేవాలయాల నిర్మాణానికి భూమి పూజ జరిగిందని, ఆయా ప్రాంతాల నుంచి భక్తుల్ని ఉచిత బస్సుల్లో శ్రీవారి దర్శనానికి తీసుకెళ్తున్నామని సమరసతా సేవా ఫౌండేషన్ ధర్మ ప్రచారకుడు కొల్లి అప్పారావు తెలిపారు. సబ్ డివిజన్ కన్వీనర్ బి.వి రమణ మాట్లాడుతూ శ్రీవారి దర్శన భాగ్యం దొరకడం ఎంతో అదృష్టంగా పేర్కొన్నారు. కాగా శుక్రవారం ఉచిత బస్సులను కొబ్బరికాయ కొట్టి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ ద్వారపురెడ్డి బాబ్జీ, వసంతవాడ దిన్‌బాబు,దొడ్డి కృష్ణ, గుడివాడ రమణ పాల్గొన్నారు.

అర్హతే కొలమానంగా పింఛన్ల మంజూరు



లబ్ధిదారులకు నూతన పింఛను అందజేస్తున్న ఎమ్మెల్యే రమణమూర్తిరాజు

రాంబిల్లి: ప్రభుత్వ సంక్షేమ పథకాలతో ప్రజలకు ఎంతో మేలు జరుగుతుందని ఎమ్మెల్యే యు.వి. రమణమూర్తిరాజు(కన్నబాబు) అన్నారు. హరిపురంలో శుక్రవారం ఆయన కొత్త లబ్ధిదారులకు పింఛన్లు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ , రాంబిల్లి మండలంలో కొత్తగా 205 మందికి పింఛన్లు మంజూరయ్యాయన్నారు. పార్టీలకతీతంగా కేవలం అర్హత కొలమానంగా సంక్షేమ పథకాలు అందిస్తున్న ఘనత జగనన్నకే దక్కుతుందన్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అందిస్తున్న ఈ సంక్షేమం, అభివృద్ధి కార్యకలాపాలను గడపగడపకు తీసుకుపోవాలన్నారు. కార్యక్రమంలో డీసీసీబీ మాజీ చైర్మన్ సుకుమారవర్మ, ఎంపీపీ శిరీషశ్రీనుబాబు, జెడ్పీటీసీ ధూళి నాగరాజు, వైస్ ఎంపీపీ నర్సింగరావు, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ పిన్నంరాజు కిషోర్, వైఎస్సార్‌సీపీ నాయకుడు డీఎస్ఎన్ రాజు, సర్పంచ్ ధూళి దేవుడమ్మ బుజ్జి , ఎంపీడీవ కొండలరావు పాల్గొన్నారు.

రేపు వెలమ సంఘం ఆత్మీయ సమావేశం



నియోజక వర్గ పరిశీలకుడు రొంగలి జగన్నాథంను కలిసిన వెలమ సంఘం నాయకులు

యలమంచిలి : నియోజక వర్గ వెలమ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఈనెల 8వ తేదీన అచ్యుతాపురంలో వెలమ సామాజిక వర్గం ఆత్మీయ సమావేశం నిర్వహించనున్నట్టు దొప్పెర్ల సర్పంచ్ కొరుప్రోలు చిన్నారావు, అచ్యుతాపురం సర్పంచ్ కూండ్రపు విమల నాయుడు తెలిపారు. ఈ కార్యక్రమానికి హాజరు కావలసినదిగా శుక్రవారం యలమంచిలి నియోజకవర్గ వైఎస్సార్ కాంగ్రెస్ పరిశీలకులు రొంగలి జగన్నాథంను ఆహ్వానించినట్టు వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో అడిగర్ల దేముడు, రాజాన విజయ్, ధర్మిరెడ్డి శ్రీను తదితర వెలమ సంఘం నాయకులు పాల్గొన్నారు.

జాతీయ స్థాయి హ్యాండ్ బాల్ పోటీలకు ఎంపిక



హ్యాండ్‌బాల్ పోటీలకు ఎంపికైన విద్యార్థిని యశస్విని

పాయకరావుపేట : శ్రీ ప్రకాష్ జూనియర్ కళాశాలలో ద్వితీయ సంవత్సరం చదువుతున్న పి.యశస్విని రాజస్థాన్‌లోని దిద్వానాలో ఈ నెల 11 నుండి 15 వరకు జరుగనున్న 44 వ జూనియర్ బాలికల నేషనల్ హ్యాండ్ బాల్ ఛాంపియన్‌షిప్‌కి ఎంపికైందని కళాశాల ప్రిన్సిపాల్ వివిఎస్ఎస్ భానుమూర్తి తెలిపారు. గత నెల అనంతపురం జిల్లా కదిరి హరీష్ స్కూల్లో జరిగిన రాష్ట్ర స్థాయి హ్యాండ్ బాల్ పోటీల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచినందుకు యశస్విని ఎంపికైందని ఆయన తెలిపారు. జాతీయ స్థాయి హ్యాండ్ బాల్ పోటీలకు ఎంపికైన యశస్విని విద్యాసంస్థల అధినేత నరసింహారావు, సంయుక్త కార్యదర్శి విజయ్ ప్రకాష్, వ్యాయమ ఉపాధ్యాయులు బాలరాజు, సురేష్ అభినందించారు.

సప్పరం వాహనంపై శ్రీనివాసుడు



సప్పరం వాహనంపై స్వామికి తిరువీధి సేవ నిర్వహిస్తున్న అర్చకులు

నక్కపల్లి : ధనుర్మాస అధ్యయనోత్సవాల్లో భాగంగా శుక్రవారం ఉపమాకలో వేంకటేశ్వరుడిని సప్పరం వాహనంలో తిరువీధి సేవ నిర్వహించారు. ఉదయం స్వామివారి మూలవిరాట్‌కు నిత్యాభిషేకాలు, పూజలు నిర్వహించారు. క్షేత్రపాలకుడు వేణుగోపాల స్వామికి, ఆండాళ్లమ్మ వారికి పూజలు నిర్వహించిన అనంతరం నీరాజన మంత్రపుష్పాలు తీర్థగోష్టి ప్రసాద వినియోగం జరిగాయి. అనంతరం స్వామివారిని ఇత్తడి సప్పరం వాహనంలో, గోదాదేవి అమ్మవారిని పల్లకిలో ఉంచి తిరువీధి సేవలు నిర్వహించారు. రాత్రి అధ్యయనోత్సవాల్లో భాగంగా పల్లకిలో స్వామివారికి తిరువీధి సేవలు జరిగాయి. అనంతరం అమ్మవారి సన్నిధిలో తిరుప్పావై 21వ పాశురాన్ని విన్నపం చేశారు. ఈ కార్యక్రమాల్లో అర్చక స్వాములు ప్రసాదాచార్యులు, కృష్ణమాచార్యులు, శేషాచార్యులు, గోపాలాచార్యులు టీటీడీ సిబ్బంది పాల్గొన్నారు.

శ్రీనివాసునికి లక్ష తులసి పూజ

అనకాపల్లిటౌన్ : స్థానిక రింగ్‌రోడ్డు సీతారామస్వామి దేవాలయంలో ధనుర్మాస వేడుకల్లో భాగంగా శుక్రవారం పౌర్ణమి సందర్భంగా శ్రీనివాసునికి లక్ష తులసి పూజ అత్యంత వైభవంగా నిర్వహించారు. ఆలయ అర్చకులు కె.సుబ్రహ్మణ్యశర్మ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆలయ అధ్యక్షుడు కోడూరు త్రినాథరావు మాట్లాడుతూ ఈనెల 14న భోగి రోజున శ్రీ రంగనాథ గోదాదేవి కల్యాణ మహోత్సవం నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఈ కల్యాణ మహోత్సవంలో భక్తులు పాల్గొని తరించాల్సిందిగా కోరారు. పూజా కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు బి.ద్రాక్షాయిని, లక్ష్మి, పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకువెళ్లాలి



మాట్లాడుతున్న మునగపాక సర్పంచ్ అప్పారావు

మునగపాక : ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకువెళ్లాలని మునగపాక సర్పంచ్ దిమ్మల అప్పారావు కోరారు. మునగపాక వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో శుక్రవారం రాత్రి పాలకవర్గ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అప్పారావు మాట్లాడుతూ వలంటీర్లు, సచివాలయ కన్వీనర్లు, పాలకవర్గ సభ్యులు సమన్వయంతో పనిచేయాలన్నారు. రానున్న ఎన్నికల్లో జగన్‌మోహన్‌రెడ్డిని తిరిగి సీఎంగా చేసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. అలాగే అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందేలా చూడాలన్నారు. ప్రధానంగా జగనన్న ఇళ్ల నిర్మాణాలు వేగవంతమయ్యేలా చూడాలన్నారు. సమావేశంలో ఉప సర్పంచ్ పెంటకోట సత్యనారాయణ, ఉత్సవకమిటీ చైర్మన్ బొడ్డేడ అప్పలనాయుడు,వార్డు సభ్యులు వెలగా శేషు సురేష్‌కుమార్,రామచంద్రరావు, దాడి పోలీసు, బలిరెడ్డి సూరప్పారావు,ఆడారి రామప్పలనాయుడు,దాడి మురళి పాల్గొన్నారు.

డీఎస్పీ సందర్శన

రాంబిల్లి: ప్రజలకు మెరుగైన సేవలందించాలని డీఎస్పీ పి. శ్రీనివాసరావు అన్నారు. రాంబిల్లి పీఎస్‌ను శుక్రవారం ఆయన సందర్శించి ఎస్ఐ దీనబంధు, సీఐ గపూర్‌లకు పలు సూచనలు చేశారు. పలు కేసులపై ఆరా తీశారు. నేవీ మెయిన్ గేటు వద్ద నేవీ నిర్వాసితుల చేస్తున్న ధర్నా విషయంపైనా చర్చించారు.

బెంగళూరు సభను జయప్రదం చేయండి



విలేకరులతో మాట్లాడుతున్న ఎంఆర్‌పీఎస్ నాయకులు

పాయకరావుపేట : ఈ నెల 11వ తేదీన బెంగళూరులో జరిగే మాదిగ జాతీయ కార్యవర్గ సమావేశాన్ని జయప్రదం చేయాలని ఎంఆర్‌పీఎస్ జిల్లా ఇన్‌చార్జ్ ఘాటీలు తెలిపారు. ఎంఆర్‌పీఎస్ నాయకులు పట్టణంలో సమావేశమయ్యారు. ఈ నెల 11న ఎంఆర్‌పీఎస్ వ్యవస్థాపకుడు మందకృష్ణ మాదిగ అధ్యక్షతన జరిగే సభకు ఎంఆర్‌పీఎస్ నాయకులంతా హాజరై జయప్రదం చేయాలన్నారు.

లైఫ్ సర్టిఫికెట్ల అప్‌లోడ్‌పై హర్షం

అనకాపల్లిటౌన్ : పెన్షనర్ల లైఫ్ సర్టిఫికెట్లు అప్‌లోడ్ చేసేందుకు పట్టణంలోని పడమర సబ్‌ట్రెజరీ కార్యాలయంలో మూడు బెంచ్‌లు ఏర్పాటు చేయడంపై పెన్షనర్లు శుక్రవారం ఓ ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు. వృద్ధుల ఇబ్బందులపై ప్రభుత్వం దృష్టి సారించి ఫిబ్రవరి నెలాఖరు వరకు ఈ సౌకర్యం కల్పించడం పట్ల ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు.

కొనసాగుతున్న నేవీ నిర్వాసితుల ధర్నా



ధర్నాలో పాల్గొన్న నేవీ నిర్వాసితులు

రాంబిల్లి: నేవీ మెయిన్‌గేటు వద్ద నేవీ నిర్వాసితుల ధర్నా కొనసాగుతోంది. శుక్రవారం వాడనర్సాపురం, కొప్పుగొండుపాలెం, కొత్తపట్నం, నేవీ పునరావాసకాలనీ, వాడపాలెం, గోవిందపాలెం, చినకవలాపల్లి, కొత్తపేట గ్రామాల ప్రజలు ధర్నాలో పాల్గొన్నారు.

అందరికీ ఇళ్లు అందిస్తున్న ఘనత జగనన్నదే



రామన్నపాలెంలో నవరత్నాల కరపత్రాన్ని అందజేస్తున్న ఎమ్మెల్యే కన్నబాబురాజు, డీసీసీబీ మాజీ చైర్మన్ సుకుమారవర్మ



సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న దృశ్యం

అచ్యుతాపురం(అనకాపల్లి) : ఇంటింటికీ వెళ్లి ప్రజా సమస్యలు తెలుసుకుంటున్నప్పుడు జరుగుతున్న అభివృద్ధి ప్రజలు తెలియపరచడం ఎంతో సంతోషాన్నిస్తుందని యలమంచిలి ఎమ్మెల్యే ఉప్పలపాటి రమణమూర్తిరాజు అన్నారు. అచ్యుతాపురం మండలంలోని రామన్నపాలెం శుక్రవారం ఆయన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొన్నారు. నవరత్నాలతో జరుగుతున్న సంక్షేమంపై ఆరా తీశారు. ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలను అమలు చేసేందుకు సచివాలయ వ్యవస్థను పటిష్టం చేశారని, దీనికి అనుసంధానంగా వలంటీర్లు పనిచేస్తున్నారని ఆయన అన్నారు. ఎక్కడైనా ప్రభుత్వ పథకాలు అందకుంటే సాంకేతిక కారణాల వల్లే తప్ప రాజకీయ పరమైన కక్షలు ఈ ప్రభుత్వంలో ఉండవని అన్నారు. ప్రజలకు ఎవరికైనా సమస్యలుంటే తమకు తెలియపరచవచ్చన్నారు. జనవరి ఒకటో తేదీ నుంచి పెరిగిన పింఛను సొమ్ము అందిస్తున్నామని, అందరికీ ఇళ్లు అందిస్తున్న ఘనత ఈ ప్రభుత్వానిదేనని అన్నారు. మూడేళ్లలో జరిగిన అభివృద్ధి గురించి వివరించారు. గ్రామంలో కనిపించిన ప్రతి ఒక్కరితో మాట్లాడుతూ వారి యొక్క వ్యక్తిగత ఇబ్బందులు, అవసరాల గురించి ఆరా తీశారు. ఎటువంటి సమస్యలున్నా స్థానిక వాలంటీర్లను గానీ, సచివాలయ సిబ్బందిని గానీ సంప్రదించాలని సూచించారు. డీసీసీబీ మాజీ చైర్మన్ సుకుమార వర్మ, ఎంపీటీసీ లాలం శ్రీను, నాయుడు బాబు, ఎంపీపీ కోన బుజ్జి, జడ్పీటీసీ లాలం రాంబాబు, జడ్పీ కో-ఆప్షన్ సభ్యుడు నర్మాల కుమార్, మండల వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు దేశంశెట్టి శంకర్‌రావు, అధికార ప్రతినిధి పిన్నమరాజు వాసు, బోడపల్లి సర్పంచ్ గండిబోయిన వెంకట్ తదితరులు పాల్గొన్నారు.

మాట తప్పని, మడమ తిప్పని నేత...

అచ్యుతాపురం(అనకాపల్లి) : రాష్ట్రంలో కొద్దిపాటి ఆర్థిక ఇబ్బందులు ఉన్నప్పటికీ ఇచ్చిన మాట కోసం , పేదల సంక్షేమం కోసం మడమ తిప్పని నేత సీఎం జగన్‌మోహన్‌రెడ్డేనని యలమంచిలి ఎమ్మెల్యే ఉప్పలపాటి రమణమూర్తిరాజు అన్నారు. జనవరి ఒకటో తేదీ నుంచి పంపిణీ చేస్తున్న పెంచిన పింఛన్ల సొమ్ము పంపిణీ కార్యక్రమాల్లో భాగంగా శుక్రవారం అచ్యుతాపురం మండలంలోని మోసయ్యపేట వద్ద సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ప్రతి పక్షాలు ఎన్ని విమర్శలు చేసినా ప్రజల కోసం, సంక్షేమాన్ని అందిస్తున్న ఘనత సీఎంకే దక్కుతుందన్నారు. వృద్ధులు, వికలాంగులు, వితంతులకు అర్హతలు ఉంటే పింఛన్లు మంజూరు చేస్తున్నారని, దీనికిగానూ నిరంతరం దరఖాస్తులు తీసుకుంటున్నారని ఆయన తెలిపారు. అంతకు ముందు అచ్యుతాపురం జంక్షన్‌లోని వైఎస్ఆర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో డీసీసీబీ మాజీ చైర్మన్ సుకుమార వర్మ, జెడ్పీటీసీ లాలం రాంబాబు, జెడ్పీ కో-ఆప్షన్ సభ్యుడు నర్మాల కుమార్, సర్పంచ్‌లు పంచదార్ల పైడిరాజు, విమలనాయుడు, గండిబోయిన వెంకట్, మండల వైఎస్ఆర్‌సీపీ అధ్యక్షుడు దేశంశెట్టి శంకర్‌రావు, వైఎస్సార్‌సీపీ అధికార ప్రతినిధి పిన్నంరాజు వాసు, ఎంపీటీసీలు లాలం శ్రీను, రావి శోభన్‌బాబు పాల్గొన్నారు.

దశల వారీగా డ్రైనేజీలు, రోడ్ల నిర్మాణం



గ్రామసభలో మాట్లాడుతున్న సర్పంచ్ గారా ఉష శ్రీ

పాయకరావుపేట : గ్రామంలో నెలకొన్న సమస్యలను దశల వారీగా పరిష్కరించడం జరుగుతుందని పాయకరావుపేట గ్రామ సర్పంచ్ గారా ఉష శ్రీ అన్నారు. గ్రామ పంచాయతీ కార్యాలయంలో శుక్రవారం గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచ్ గారా ఉష శ్రీ మాట్లాడుతూ గ్రామంలో గల ఆయా వార్డుల్లో డ్రైనేజీలు, కల్వర్టుల నిర్మాణం, రోడ్లు దశల వారీగా నిర్మాణం చేయడం జరుగుతుందన్నారు. అనంతరం కార్యదర్శి జె.చంద్రశేఖర్ పనితీరుపై అసహనం వ్యక్తం చేశారు. గ్రామ సభకు తగిన ప్రచారం గ్రామంలో చేయలేదని గ్రామస్తులు సభకు ఎందుకు హాజరు కాలేదని కార్యదర్శిని నిలదీశారు. అదే విధంగా ఈ మధ్య కాలంలో ఏ ఏ వార్డులో ఏఏ అభివృద్ధి పనులు చేశారో తెలియజేయాలని నిలదీశారు. సంక్రాంతి వెళ్లిన తర్వాత ప్రతి వార్డును పర్యటించి సమస్యలు తెలుసుకుని పరిష్కరించడం జరుగుతుందన్నారు. ఈ సమావేశంలో గ్రామ పంచాయతీ వార్డు సభ్యులు, గ్రామ వలంటీర్లు, అంగన్‌వాడీ టీచర్లు, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

వలంటీర్లూ.. మీకు వందనాలు

అనకాపల్లి టౌన్/కశింకోట : పింఛన్ల పంపిణీలో సీఎం జగన్ ఆశయాలకు వలంటీర్లు మరింత ఆసరాగా నిలుస్తున్నారు. వృద్ధులు, దివ్యాంగులు ఇబ్బంది పడరాదనే.. వారింటికే వెళ్లి పింఛన్లు అందించేలా జగన్ ప్రభుత్వం చర్యలు తీసుకున్న విషయం తెలిసిందే. కొన్ని విపత్కర సమయాలు, అనారోగ్యంతో ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నపుడు వలంటీర్లు తమ మానవత్వాన్ని చాటుకుంటున్నారు. తమ సొంత ఖర్చుతో ఆయా ప్రాంతాలకు వెళ్లి మరీ, వారికివ్వాల్సిన పింఛన్ నగదును అందిస్తున్నారు. ప్రభుత్వ ఆశయాలను నెరవేర్చడంలో తోడ్పడుతున్నారు. అదే కోవలో జనవరి నెల పెంచిన పింఛన్ల అందజేతలో కూడా ఇద్దరు వలంటీర్లు తమ పెద్ద మనసును చాటుకున్నారు.



ఆస్పత్రిలో వేణుగోపాలరావు బయోమెట్రిక్ తీసుకుంటున్న వలంటీర్ వెంకట అప్పారావు

మండలంలో మేజర్ పంచాయతీ అయిన తుమ్మపాల సచివాలయం-3 పరిధి చిన్నిబాబుకాలనీకి చెందిన ఆకెళ్ల వేణుగోపాలరావు ఊపిరితిత్తుల వ్యాధితో బాధపడుతున్నాడు. నెల రోజుల నుంచి విశాఖలోని ఓ ప్రయివేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. వలంటీర్ వెంకట అప్పారావు వృద్ధునికి పింఛన్ కానుక ఎలాగైనా త్వరితగతిన అందించాలనే ఆలోచనతో విశాఖలోని సదరు ఆస్పత్రి వెళ్లాడు. ఆస్పత్రిలో వ్యాధితో పోరాడుతున్న వృద్ధునికి పెంచిన రూ.2,750 పింఛన్ అందించాడు. వేణుగోపాలరావు కుటుంబ సభ్యులు జగన్ ప్రభుత్వం చిత్తశుద్ధికి ధన్యవాదాలు తెలిపారు.



గాడి సత్యవతికి ఆస్పత్రిలో పింఛన్ సొమ్ము అందిస్తున్న గ్రామ వలంటీర్ పప్పల సుజాత

కశింకోటలోని సత్తెమ్మ కాలనీకి చెందిన గాడి సత్యవతి విశాఖలోని ప్రైవేటు ఆస్పత్రిలో కిడ్నీ సమస్యతో బాధపడుతూ కొద్ది రోజులుగా చికిత్స పొందుతోంది. అయితే గడువు మేరకు శనివారంలోగా పింఛన్ సొమ్ము తీసుకోకపోతే అది వెనక్కి వెళ్లిపోయే అవకాశం ఉంది. ఈ నేపథ్యంలో స్థానిక అఫీషియల్ కాలనీకి చెందిన గ్రామ వలంటీర్ పప్పల సుజాత ఇక్కడ నుంచి విశాఖకు వెళ్లి సత్యవతికి రూ.2,750 పింఛన్ సొమ్మును అందజేశారు. దీంతో సత్యవతి ఆనందం వ్యక్తం చేశారు. వలంటీర్ సుజాతకు, సీఎం జగన్‌కు కృతజ్ఞతలు తెలిపారు.